భీమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



2



2

ముగిసిన క్రికెట్ టోర్నీ

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## బైకు చోరీ కేసులో నిందితుడి రిమాండ్

**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని దూద్‌గావ్ శివారులో ఉన్న ఆర్‌కే ఫంక్షన్ హాల్ సమీపంలో బైకు దొంగతనం జరిగిన ఘటనలో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపాడ్‌కు చెందిన సయ్యద్ అజమ్‌కు చెందిన బైకును నిర్మల్‌కు చెందిన షిండే గణేశ్ అనే వ్యక్తి బుధవారం రాత్రి దొంగతనం చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మెండోరా పోలీసులు.. నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సుహాసిని తెలిపారు.



## బస్ డిపో ఏర్పాటుకు వినతి



**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట్‌లో బస్‌డిపో ఏర్పాటు చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిసి బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా నందిపేట్, చుట్టు పక్కల మండలాల ప్రజలు బస్‌డిపో ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారని వినయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బస్‌డిపో ఏర్పాటుతో రవాణా సౌకర్యం మరింత మెరుగవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఆర్మూర్‌లోని ఎన్టీఆర్ కాలనీలో సమస్యలను సైతం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ రెండు సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి పొన్నం హామీ ఇచ్చారని వినయ్ రెడ్డి పేర్కొన్నారు.

## కౌన్సిలర్ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, కామారెడ్డి:** కాంగ్రెస్ పార్టీ నుంచి కామారెడ్డి మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పట్టణ కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు, పట్టణ కమిటీ సభ్యులకు అందజేయాలని తెలిపింది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొంది. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజాసేవ చేయాలనే తపన ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించాలని కోరింది. షబ్బీర్ అలీ నాయకత్వంలో కామారెడ్డి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చింది.

**మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల ఉత్కంఠకు తెరపడింది. ఛైర్మన్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో.. ఆ పదవి ఆశిస్తున్న వారు ప్రయత్నాలు ప్రారంభించారు. కౌన్సిలర్‌గా గెలవకముందే ఛైర్మన్ పదవిపై హామీ తెచ్చుకునేందుకు నాయకులు పోటీ పడుతున్నారు. పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకుంటున్నారు. ముఖ్య నాయకులను కలిసి తమ మనసులో మాటను చెప్పుకుంటున్నారు. ఎంత ఖర్చు అయిన సరే అని చెబుతున్నట్లు తెలిసింది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

# ఛైర్మన్ పీఠంపై గురి




- నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు
- ఖర్చుకు వెనకాడని వైనం
- గెలుపే లక్ష్యంగా పార్టీల కసరత్తు

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీలున్నాయి. ఎల్లారెడ్డి, బాన్సువాడలో రెండోసారి, బిచ్కుందలో మొదటిసారి మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. కామారెడ్డి మున్సిపాలిటీలో ఈసారి ఎన్నికలు రసవత్తరంగా సాగనున్నాయి. కామారెడ్డి, బాన్సువాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులు బీసీ మహిళకు రిజర్వ్ కాగా.. ఎల్లారెడ్డి జనరల్, బిచ్కుంద బీసీ జనరల్‌కు కేటాయించారు. దాంతో ఈసారి పోటీ ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి.

### నేతల చుట్టూ ప్రదక్షిణలు

మున్సిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్లు, ఛైర్మన్ల రిజర్వేషన్లు ప్రకటించడంతో ఆశావహులు టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈసారి దాదాపు అన్ని వార్డులలో కొత్తవారు పోటీలో ఉండే అవకాశాలు ఉన్నాయి. అన్ని పార్టీల్లో పోటీ తీవ్రంగా ఉంది. దీంతో తమకే సీటు ఇవ్వాలంటూ పలువురు ఆశావహులు ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ముఖ్యంగా కాంగ్రెస్‌లో పోటీ తీవ్రంగా ఉంది. దీంతో ఆ పార్టీ నాయకుల చుట్టూ పలువురు టికెట్ కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎంత ఖర్చు పెట్టడానికి అయినా తాము సిద్ధమని పలువురు అంటున్నారు. టికెట్ ఇస్తే గెలుస్తామని చెబుతున్నారు. నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు అభ్యర్థుల పేర్లు మాత్రం సస్పెన్స్‌లో ఉంచనున్నారు.

### వారికే అవకాశం

ఎల్లారెడ్డి మున్సిపల్ పీఠం జనరల్‌కు రావడంతో అక్కడ పోటీ అధికంగా ఉండనుంది. అన్ని వార్డుల అభ్యర్థులకు ఛైర్‌పర్సన్ పదవి పొందే అర్హత ఉంటుంది. ఇక కామారెడ్డి పదవి బీసీ మహిళలకు రిజర్వ్ అయింది. బల్దియాలో మొత్తం 9 వార్డులు బీసీ మహిళలకు రిజర్వ్ అయ్యాయి. దీంతో ఆ వార్డుల్లో గెలిచిన వారు మాత్రం ఛైర్ పర్సన్ కానున్నారు. దీంతో ఆయా వార్డుల్లో టికెట్ కోసం పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. బాన్సువాడ, బిచ్కుందలో సైతం ఛైర్‌పర్సన్ పదవి కోసం నాయకులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార కాంగ్రెస్‌తో పాటు, బీఆర్ఎస్, బీజేపీలో టికెట్ల కోసం పోటీ తీవ్రంగానే ఉంది. మరోవైపు ఎలాగైనా మెజారిటీ వార్డులను కైవసం చేసుకోవాలని బల్దియాల్లో జెండా ఎగురవేయాలని ఆయా పార్టీల నాయకులు కసరత్తు చేస్తున్నారు. బలమైన వారికే టికెట్లు ఇవ్వడానికి చర్యలు చేపట్టారు.

### కొత్త వారికి ఛాన్స్

మున్సిపల్ ఛైర్ పర్సన్ పదవులు ఈ సారి కొత్తవారికి దక్కనున్నట్లు సమాచారం. ముఖ్యంగా కామారెడ్డి ఛైర్ పర్సన్ పదవిపై జోరుగా సాగుతోంది. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి ఛైర్మన్‌గా చేసిన వారికి ఈసారి అవకాశాలు తక్కువగా ఉన్నట్టుగా తెలుస్తోంది. గతంలో పీఠం ఆశించి, భంగపడిన వారికి ఈసారి అవకాశం ఇవ్వనున్నట్టుగా సమాచారం. మరోవైపు ఊహించని వ్యక్తుల పేర్లు కూడా ఛైర్మన్ రేసులో ఉన్నట్లుగా ప్రచారం సాగుతోంది.



## కాంగ్రెస్‌తోనే ఎల్లారెడ్డి అభివృద్ధి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎల్లారెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధి బాటలో సాగుతోందని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని 2, 4, 12 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా వార్డుల సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. వార్డు ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న సమస్యలను తప్పనిసరిగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ప్రస్తావించిన చిన్నచిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే అధికారులు నోట్ చేసుకునేలా ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ.. గత 30ఏళ్లలో తమ వార్డులో ఈ స్థాయిలో అభివృద్ధి ఎప్పుడూ జరగలేదని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను మున్సిపల్ ఏఈ ద్వారా నమోదు చేసుకున్నామని వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ వార్డు అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఎల్లారెడ్డి మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరేస్తాం

**అక్షరటుడే,ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో అన్ని స్థానాల్లో పోటీ చేసి బల్దియాపై బీజేపీ జెండా ఎగరేస్తామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బాణాల లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డుకు ఇన్‌ఛార్జీలను నియమించినట్లు బాణాల లక్ష్మారెడ్డి తెలిపారు. అదేవిధంగా జరగబోయే అన్ని మున్సిపాలిటీలపై బీజేపీ జెండా ఎగురవేయాలని రాష్ట్ర బీజేపీ గట్టి సంకల్పంలో ఉందన్నారు. ఇదే సంకల్పంతో మహారాష్ట్ర బల్దియా ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. అలాగే మహారాష్ట్ర, కర్ణాటక ఎమ్మెల్యేలను ఎల్లారెడ్డికి ఇన్‌ఛార్జీలుగా పంపుతామని రాష్ట్ర కమిటీ సూచన చేయడం జరిగిందన్నారు. ప్రతిఒక్క కార్యకర్త సైనికుల్లాగా పనిచేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట నాయకులు బాలకిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, పట్టణ అధ్యక్షుడు రాజేష్, మండల అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శులు శ్రీను,అశోక్, మహిళా నాయకురాలు సుజాత, మాజీ ఎంపీపీ నక్క గంగాధర్, మాజీ అధ్యక్షుడు సతీష్, హన్మాండ్లు, దత్తు, సీనియర్ నాయకులు బాలరాజ్, సత్యం, బాలయ్య, యువ నాయకులు శివ, పులి రమేష్, శివ, పండరి తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ ప్రమోద్ సేవలు మరువలేనివి : సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** కానిస్టేబుల్ ప్రమోద్ సేవలు మరువలేనివని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో దివంగత కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ జ్ఞాపకార్థం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యువతను ప్రోత్సహించే క్రమంలో ఫుట్ బాల్ టోర్నీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ వీరమరణం పొందిన సహచరుడు, కానిస్టేబుల్ ప్రమోద్ జ్ఞాపకార్థం ఈ ఫుట్ బాల్ టోర్నీని నిర్వహిస్తున్నామన్నారు. దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశాడన్నారు. ఆయన సేవలు, ధైర్యసాహసాలు పోలీస్ విభాగానికి మాత్రమే కాదు.. సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ టోర్నీ ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఐక్యత పెంపొందడమే కాకుండా.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల త్యాగాలను స్మరించుకునే అవకాశం లభిస్తుందని సీపీ అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక బలాన్ని పెంచి, సానుకూల దృక్పథాన్ని కలిగిస్తాయన్నారు. నిజామాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల అనేక మండలాల్లో యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేందుకు క్రీడాపోటీలు నిర్వహించిందని సీపీ గుర్తు చేశారు. 'సే నో టు డ్రగ్స్', 'సే ఎస్ టు స్పోర్ట్స్' అనే నినాదంతో యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే గత వారంలో ప్రారంభమైన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా ప్రజల భద్రత రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలను, ప్రమాద నివారణ సూచనలు గురించి ప్రస్తావించడం జరిగిందన్నారు. తోటి పౌరుల, కుటుంబ సభ్యుల



భవిష్యత్తు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తగిన ప్రభుత్వం, పోలీసు వారు సూచించిన నియమాలు జాగ్రతలు పాటించాలని సీపీ సూచించారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వా రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి , బోధన్ ఏసీపీ శ్రీనివాస్, జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మీర్ ఫారూఖ్ అలీ, డీవైఎస్‌వో పవన్ కుమార్, జిల్లా రంజీ క్రికెట్ ప్లేయర్ అంకిత్ రెడ్డి, ఫుట్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ జావిద్, జాయింట్ సెక్రెటరీ మసూద్, కోచ్ నాగరాజు టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్ పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసే కాంగ్రెస్‌లో చేరికలు: ముత్యాల సునీల్‌రెడ్డి

**అక్షరటుడే, భీమ్‌గల్:** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. మండలంలోని ఎంజీ తండాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు ఆదివారం బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ భారీ చేరికలతో ఎంజీ తండాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడిందని స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఎంజీ తండా సర్పంచ్ దేగావత్ అమీనా, ఉప సర్పంచ్ దేగావత్ గణేష్ నేతృత్వంలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కేతావత్ హుస్సేన్, లింబాద్రి, లలిత, లక్ష్మి, లత, మలావత్ రాజు, దిగావత్ గంగు తదితరులు ఉన్నారు. వీరితో పాటు ఎంజీ తండా వీడీసీ పెద్దలు, మాజీ సర్పంచ్ రమేష్, మాజీ ఎంపీటీసీ వల్లి, పరమేష్, మోహన్, వినోద్, మోతీలాల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.




## అభివృద్ధే ముఖ్యం.. ప్రొటోకాల్ కాదు: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధే తనకు ముఖ్యమని, ప్రొటోకాల్‌తో తనకు పనిలేదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి పట్టణంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ఆర్ హయాంలో రూ.240 కోట్లతో 105 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసి కామారెడ్డికి గోదావరి జలాలను తీసుకొచ్చానన్నారు. పనులు చేపట్టి 20 ఏళ్లు కావడంతో అక్కడక్కడా టెక్నికల్ సమస్యలతో పైప్‌లైన్లు పగిలిపోయి ఇబ్బంది అయ్యిందన్నారు. కామారెడ్డికి గోదావరి నీళ్లు వస్తే తనకు ఎక్కడ పేరు వస్తుందోనని.. గత ఎమ్మెల్యే పక్కవాళ్లు నీళ్లను తీసుకుపోతుంటే కూడా అడ్డు చెప్పలేదని విమర్శించారు. మళ్లీ 20 ఏళ్ల తర్వాత ఈ పనులు కంటిన్యూ చేయాలని.. సీఎంను అడిగి రూ.195 కోట్లు మంజూరు చేయించానన్నారు. టెండర్లు కూడా పూర్తయి పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. ఫిబ్రవరి 28 తేదీలోపు పనులు పూర్తి చేస్తామని మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పారని తెలిపారు. ఇండోర్ స్టేడియానికి రూ.8 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఇటీవల మంత్రి సీతక్క స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారన్నారు. అయితే పనులు చేపట్టడానికి 28 గుంటల స్థలం తక్కువైందని, పక్కనే ఉన్న వైద్యశాఖకు సంబందించిన స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను కోరడం జరిగిందన్నారు. తాను చదువుకున్న జిల్లాపరిషత్ బాయ్స్ హైస్కూల్ నూతన భవనం నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లాకు అండర్ గ్రౌండ్ సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తీరుతో పనులు ప్రారంభించలేదన్నారు. ప్రారంభోత్సవం చేయడానికి ఎమ్మెల్యే సమయం కోసం డిప్యూటీ సీఎం వెయిట్ చేస్తున్నారని, అధికారులు ఎమ్మెల్యే సమయం ఇవ్వాలని వెళ్తే రేపుమాపు అంటూ సమయం ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్ రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఇంద్రకరణ్ రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.







## భీమేశ్వర ఆలయానికి
# పోటెత్తిన భక్తులు..

**అక్షరటుడే, లింగంపేట :** మాఘ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఆలయాలను దర్శించుకుంటున్నారు. తాడ్వాయి మండలం సంతాయిపేట అటవీ ప్రాంతంలోని భీమేశ్వర ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కామారెడ్డి జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన భీమేశ్వర ఆలయానికి మాఘ అమావాస్య సందర్భంగా భక్తులు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఉంచుకొని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు, తాడ్వాయి ఎస్సై నరేష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భీమేశ్వర వాగులో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటున్నారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ముందస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. భీమేశ్వర ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పార్కింగ్ ఇబ్బంది రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు నెమ్మదిగా వెళ్లాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. భీమేశ్వర జాతరను పురస్కరించుకొని కామారెడ్డి ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. స్పెషల్ బస్సులను ఆలయం వరకు నడిపిస్తున్నారు. కామారెడ్డి నుంచి తాడ్వాయి మీదుగా సంతాయి పేట్ భీమేశ్వర ఆలయానికి బస్ సర్వీసులను ఏర్పాటు చేశారు.

## రోడ్డు మధ్యలో గుంతతో ఇబ్బందులు



బాన్సువాడ పట్టణంలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో రోడ్డు మధ్యలో గుంత ఏర్పడడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో గుంత కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని గుంతను పూడ్చాలని కోరుతున్నారు. - అక్షరటుడే, బాన్సువాడ



## ముగిసిన జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్

**అక్షర టుడే, ఇందూరు:** నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించారు. మొత్తం మూడు జట్లు పోటీలో తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో శివ ఠాకూర్ జట్టు శ్యాంసుందర్ జట్టుతో తలపడింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శివఠాకూర్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 130 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్యాంసుందర్ జట్టు 80 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. దీంతో శివ ఠాకూర్ జట్టు 50 పరుగుల తేడాతో గెలుపొందింది. జట్టులో రవికాంత్ 93 పరుగులతో పాటు 2 వికెట్లు తీసి కీలకంగా వ్యవహరించారు.



## మాఘ అమావాస్య సందర్భంగా పూజలు

ఎల్లారెడ్డి మండలంలోని మాఘ అమావాస్య సందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద చెరువులో పుణ్యస్నానాలు ఆచరించి శివాలయంలో పూజలు చేశారు. భజనలతో ఆలయం మార్మోగింది. ఈ మేరకు భక్తులకు అన్నదానం చేశారు. - అక్షరటుడే, ఎల్లారెడ్డి







# ఎన్టీఆర్‌కు నివాళులు

**అక్షరటుడే, బాన్సువాడ:** దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని ఉమ్మడి జిల్లాలో ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు ఎన్టీఆర్ చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులర్పించారు. బీర్కూర్ మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరిగే ధర్మతేజ, ఉప సర్పంచ్ పరమేష్ పంతులు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ద్రోణవల్లి సతీష్, ఓంకార్, రమణ, ఆనంద్ కుమార్, బస్వరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తిమ్మాపూర్‌లో ఆదివారం ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. ఎన్టీఆర్ సినీ రంగానికి చేసిన విశిష్ట సేవలను, రాజకీయ రంగంలో ప్రజల కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. సామాన్యుల గుండెల్లో నిలిచిపోయిన నాయకుడిగా, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానుభావుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అభిమానులు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన ఎన్టీఆర్ జీవితం నేటి తరానికి ఆదర్శమని, ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి తెలుగు బిడ్డపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వీర్రాజు, వెంకటేష్, చరణ్ తేజ, శ్రీకాంత్, నాగేశ్వరరావు, రవి, ప్రసాద్, భాస్కర్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో ముగిసిన క్రికెట్ టోర్నీ

**అక్షరటుడే, కోటగిరి:** సంక్రాంతి పండుగ సందర్భంగా కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామంలో కేపీసీఎల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో దాదాపు 40 టీంలు పాల్గొన్నాయి. అందులో విన్నర్‌గా నిలిచిన వర్ని మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన టీంకు ప్రైజ్ మనీ రూ. 22,222 అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కొత్తపల్లి తండా జట్టుకు రూ.11,111 ప్రైజ్ మనీని ఎస్సై సునీల్, విద్యుత్ శాఖ ఏఈ బుచ్చిబాబు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చదువుతో పాటు యువత, క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు ఎక్కువగా ఉంటారని వారిని వెలికి తీయడానికి క్రీడాలు ఎంతో దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, రమణారెడ్డి, కొండారెడ్డి, అప్పిరెడ్డి, సాయిలు, సుదర్శన్, అశోక్ రెడ్డి, కృష్ణారెడ్డి, రమణారెడ్డి, క్రికెట్ ఆర్గనైజర్స్, బబ్లు రామకృష్ణ గోవర్ధన్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.







## ఏలేటి మహిపాల్ రెడ్డికి ఘననివాళులు

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మాజీ మంత్రి ఏలేటి మహిపాల్ రెడ్డి వర్ధంతిని కమ్మర్‌పల్లిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడిపల్లి చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిపాల్ రెడ్డి విగ్రహానికి ఆర్మూర్ మాజీ శాసనసభ్యురాలు అన్నపూర్ణమ్మ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లికార్జున్ రెడ్డి ఘన నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ కన్వీనర్ మల్కన్న గారి మోహన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నర్సారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ నరసింహారెడ్డి, కమ్మర్‌పల్లి బీజేపీ మండల అధ్యక్షుడు బద్దం రమేష్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సోమ నరేష్, మండల ఉపాధ్యక్షుడు సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ముప్కాల్ మండలంలో..

**ముప్కాల్:** దివంగత మంత్రి ఏలేటి మహిపాల్ రెడ్డి వర్ధంతిని ముప్కాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటుక బట్టీ కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముస్కు భూమేశ్, ధనేష్ బుమారెడ్డి, లోక రాములు, అశోక్, ముకీద్, నడుకుడ రమేష్, సీఎం రమేష్, ఎన్ నవీన్, ఉన్ని యాదవ్, వాచ్ నర్సయ్య, శ్రీనివాస్ గౌడ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భాజన్న దర్గాలో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని శివాజీచౌక్ వద్ద హజరత్ బాయాజిద్ రహెమతుల్లా అలే దర్గా షరీఫ్ ఆర్మూర్ (భాజన్న దర్గా) ఆవరణలో ఆదివారం స్వచ్ఛకార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా దర్గా ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆర్మూర్ పట్టణంలో ఎంతో పేరుగాంచిన భాజన్న దర్గా వద్ద ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ దర్గాలో ప్రతి శుక్రవారం ప్రజలు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించుకుంటారని వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దగ్గ ఆవరణ మొత్తాన్ని శుభ్రం చేశామన్నారు. 38 వారాలుగా నిర్విరామంగా ఈ స్వచ్ఛ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాజన్న దర్గా కమిటీ అధ్యక్షుడు మోహిద్ ఖాద్రి, ఆమ్ ఆద్మీ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సయ్యద్ అవేజ్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, వేద జీడి రాజ్‌కుమార్, గణేష్, నూకల ఆదిత్య, కృషివర్ధన్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## కొచ్చర మైసమ్మ ఆలయంలో చోరీ

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండల శివారులోని కొచ్చర మైసమ్మ ఆలయంలో దుండగులు శనివారం చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో నాలుగు హుండీల తాళాలను ధ్వంసం చేసి, అమ్మవారి వెండి ఆభరణాలతో పాటు హుండీల్లోని నగదును దొంగిలించారు. ఈ ఘటనపై ఆలయ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై రాఘవేంద్రరావు ఆదివారం ఆలయాన్ని సందర్శించి సీసీ పుటేజీని పరిశీలించారు. దుండగుల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. చోరీకి పాల్పడ్డ వ్యక్తులు ఎవరికైనా కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.